# నిష్క్రియం

ఎ.వి.రెడ్డి శాస్త్రి

నేను ఆ స్కూల్లో చేరాను- అక్కడ ఎన్నెన్నో కొత్త విషయాలు నేర్పుతున్నారని తెలిసి. ప్రతిరోజూ క్రమం తప్పకుండా క్లాసులకి హాజరవుతున్నాను. ఏవేవో చెప్తున్నారు మేష్టర్లంతా. అది చాలనట్టు ఎక్కడెక్కడ్నుండో కొత్త మేష్టర్లు కూడా చాలా మంది వస్తున్నారు- గెస్ట్ లెక్చరర్ ప్రోగ్రామ్‌లో భాగంగా. స్థానికంగా వుంటున్న మేష్టర్లు, గెస్ట్ లెక్చరర్ ప్రోగ్రాంలో వస్తున్న మేష్టర్లు చాలాచాలా విషయాలు చెప్పేస్తున్నారుకదా- వాటన్నిట్నీ శ్రద్ధగా నోట్ చేసుకుంటున్నారు స్కూల్లో చదువుకుంటున్న విద్యార్థులంతా. వాళ్లని చూస్తుంటే నాకెందుకో కాస్త వెటకారం చెయ్యాలనిపించింది. ప్రశ్నించి తెలుసుకోడంకన్నా, చేస్తున్న దాన్ని వేదవాక్కులా భావించి బుద్ధిగా నోట్ చేస్కోడంలోనే తోటి విద్యార్థులు ఆసక్తి కనపరుస్తుండడం నన్ను ఆశ్చర్యపరచింది. అందుకే వాళ్ళని చూస్తే వెటకారం చెయ్యాలనే కోరిక. "వీళ్లంతా చెప్తున్న దాన్లో ఏ కొత్త సంగతి వుందని మీరంతా అలా తెగ రాసేసుకుంటున్నారు నోట్సులు?" అని అడగాలని పదేపదే అనిపిస్తున్నా అడక్కుండా సంయమనం పాటిస్తున్నాను. నా మట్టుకు నేను ఎవరి లెక్చర్ విన్నా ఏరకమైన పాయింట్లు నోట్ చేస్కోకుండా కూర్చుంటున్నాను. నేనీ రకంగా నిర్లిప్తంగా కూర్చోడం చూసి సహించలేకనో, మరింకే కారణంచేతనో నాకు తెలీదుగాని, నన్ను చూస్తే మాత్రం చెవులు కొరుక్కుంటూ వుండేవారు నా క్లాసుమేట్స్. కొన్నాళ్ళయ్యాక మేష్టర్లక్కూడా నా ప్రవర్తన వింతగా కనిపించినట్టుంది. చివరకి ఓనాడు హిస్టరీ మేష్టారు నన్ను తన రూముకి పిలిచి "ఏనాడూ ఏ సబ్జెక్ట్ గురించీ నువ్వు నోట్సు తీసుకుంటున్నట్టు లేదు. ఇంత గొప్ప స్కూల్లో చేరి ఇలా ఏమీ పట్టనట్టు ప్రవర్తిస్తున్నావుకదా- నీ ఉద్దేశం ఏమిటి?" అనడిగేరు.

అతను లేవనెత్తిన అంశం మీద వెంటనే సమాధానం ఇవ్వడం కుదరదనిపించింది. అంచేత ఓ అయిదు నిముషాలు బాగా ఆలోచించి మరీ మాట్లాడాను. అయితే, దేనిగురించైనా స్పష్టంగా, నిర్ద్వంద్వంగా మాట్లాడ్డం అంటే నాకెందుకో భయం. దేనిగురించీ స్పష్టంగా మనకేదీ తెలీదనే నమ్మకమే బహుశా ఈ రకమైన భయానికి కారణం అయి వుండవచ్చు. అంచేత నా సమాధానం కాస్త అస్పష్టంగానే సాగింది.

"అవున్సార్, మీరు చెప్పింది నిజమే. ఇది గొప్ప స్కూలనీ, ఇక్కడ చాలాచాలా గొప్ప విషయాలు చెప్తారనీ ఆశ పెంచుకునే ఇక్కడికి వచ్చాను. తీరా వచ్చాక నాకు నిరాశే మిగిలింది. ఎందుకంటే, మీరు ఇక్కడ రోజూ చెప్తున్న విషయాల్లో ఏదీ నాకు కొత్తదాన్లాగాని, తెలియని సంగతిలాగాని అనిపించడంలేదు. మరలాంటప్పుడు నేనెందుకు ఈ విషయాల్ని నోట్ చేసుకోవాలి? మీరే చెప్పండి"

"అంటే- ఈ స్కూలుని గొప్ప స్కూలని అంటున్న వాళ్లంతా వుత్త బుద్ధిలేని వాళ్ళనా నీ వుద్దేశం? ఈ స్కూల్లో ఎన్నెన్ని కొత్త విషయాలు చెప్తుంటారో గ్రహించడానికి ఒక్కసారైనా ప్రయత్నించావా?"

"ఒక్కసారేమిటి సార్, చాలాసార్లు ప్రయత్నించాను- ఇక్కడ ఏయే కొత్త విషయాలు చెప్తున్నారో తెలుసుకుందామని.



అయితే ఇప్పటివరకూ నేను విన్న ఏ సబ్జెక్ట్‌లోనూ రవ్వంత కూడా కొత్త విషయం ఏదీ నాకు కనిపించలేదు"

"అంటే- మాకు కొత్త సంగతులేవీ తెలీవని, పాత సంగతుల్నే పాడిందే పాటగా పాడుతున్నామని నీ ఉద్దేశమా?"

"అలాగే అనిపిస్తోంది నా మట్టుకు నాకు. ఉదాహరణకి మీ సబ్జెక్ట్ హిస్టరీనే తీసుకోండి. రాజులు రావడం, రాజులు పోవడం, రాజ్యాల్ని గెలవడం, రాజ్యాల్ని వోడ్డం- ఈ దండయాత్రల మధ్యన ఎక్కడో వో దగ్గర ఆ రాజుకాస్తా హరీమనడం- మళ్లీ మరో కొత్త రాజు, మళ్లీ పాత రాజు చరిత్రే పునావృతం కావడం- ఇదీ సబ్జెక్టు. దీన్నే, ఇలాగే బండగా కాకుండా కాస్త నాజూగ్గా చెప్పుకొస్తున్నాయి కొన్ని హిస్టరీ పుస్తకాలు. ఏతావాతా చెప్పొచ్చేదేమిటంటే, మరి ఇందులో ఏం నవ్యత వుందో కాస్త వివరించండి"

"బావుందయ్యా నీ లాజిక్కు. ఒకటడుగుతాను- రోజురోజూ కొత్త విషయాలు చెప్పాలంటే ఎక్కడ్నుంచి పుట్టుకొస్తాయో కాస్త చెప్పు- వింటాను"

"ఒప్పుకున్నారుకదా- మనకి సర్వసాధారణంగా కొత్త విషయాలు ఏనాడూ రావని! పుడతాం, పెరుగుతాం, పిల్లల్ని కంటాం, చివరకేదో ఒకనాడు జీవితాన్ని ముగిస్తాం. అందరి విషయాల్లోనూ జరిగేదదే. అంచేత 'అయ్యో మనం కొత్తగా ఇక్కడ చెయ్యవలసిన పనేంలేదే అనే ఆలోచన ఒకరకంగా విచారం కలిగిస్తుంటే, ఒకవేళ ఏదేనా కొత్త పని చెయ్యడం సాధ్యపడినా, దాని ఫలితాల్ని తీరిగ్గా పరిశీలించి, అంచనా వెయ్యడానికి వ్యవధి లేకుండా మృత్యువు మన్ని కబళించివేస్తోంది కదా అని మరో దిగులు. ఇప్పుడు చెప్పండి- మీరు చెప్తున్న విషయాన్ని నేనెందుకు నోట్ చేస్కోవాలో"

"అయితే ఇక్కడ శ్రద్ధగా పాఠాలు విని నోట్సులు తయారుచేసుకుంటున్న వాళ్లంతా వుత్త వాజమ్మలనా నీ ఉద్దేశం?"

"అంత మరీ కుండ బద్దలు కొట్టినట్టు అభిప్రాయాల్ని చెబితే ఏం బావుంటుంది చెప్పండి! 'నబ్రూయాత్ సత్యమప్రియమ్' అని సంస్కృత పండితులు పాఠాలు వల్లిస్తూనే వున్నారుకదా! అయినా మీరేమీ అనుకోనంటే ఈ విషయంలో నా అభిప్రాయం చెప్తాను. ఇక్కడ చదువుకోడానికి వచ్చిన ఏ విద్యార్థినైనా తీస్కోండి- వాడి చరిత్ర- అంటే వాడి కుటుంబ చరిత్ర ఎలా వుండి వుంటుందంటారు? వాడి తాత జాగ్రత్తగా చదివి, పెద్ద ఉద్యోగం సంపాదించి, ఆర్జించగలిగినంత ఆర్జించి, కనగలిగినంత మందిని కని, చివరికి తన పని పూర్తయినట్టు ఈ లోకం నుండి నిష్క్రమించి వుంటాడు. వాడి పేరుగాని, వూరుగాని, వాడు చేసిన పని వివరాలుగాని ఇప్పుడు ఎవరికేనా గుర్తుండి వుంటాయా!

తదుపరి వీడి తండ్రిగారు. పుట్టేడు, పెరిగాడు, ఆర్జించాడు, ఆనక అస్తమించాడు. ఏవీ ఈ ప్రపంచంలో వాడి వివరాలు?

మరి ఈ జనరేషన్ వాడు- వీడేం చేస్తాడు? తాత, తండ్రీ నడిచిన తోవలోనే నడుస్తాడు. వాళ్లలాగే వీడున్నూ శ్రద్ధగా, ఇలాంటి మంచి స్కూల్లో చదువుకుంటున్నాడు. వాళ్లలాగే వీడికీ మంచి ఉద్యోగం, మంచి భార్య, మంచి ఆర్జన, మంచి పిల్లలు- చివరికి మంచి చావు!

అందరి మాదిరీ కాకుండా వీడికి ఈ ప్రపంచంలో ప్రత్యేక పాత్ర ఏదన్నావుందా? వుండదే! నలుగుర్లాగనే వాడూ బతికి, ఈ లోకం నుండి వెళ్ళిపోతాడు.

అలా కాదని మనం ఈ బతుకు ఒత్తి అర్థంలేనిదని గ్రహించి, అర్థంలేని జీవితంలో అర్థంలేని బతుకు బతక్కుండా, బతికిన నాలుగు రోజులేనా అర్థవంతంగా, మన ప్రత్యేకతని నిలబెట్టుకుంటూ బతుకుదామంటే, అదీ కుదరదే! ఎందుకంటే మృత్యువు మనని, ఎప్పుడు,

ఎలా, ఎందుకు కబళిస్తుందో తెలీదుకదా! మనమూ అందర్లాగే ప్రవర్తిస్తున్నాం అనే భావన ఒక రకం నిస్పృహ కలిగిస్తే, ప్రత్యేకంగా ఏదీ చెయ్యడానిక్కూడా వీల్లేకుండా మృత్యువొకటి కనిపెట్టుకొని వుందే మన కోసం అనే భావన మరో నిస్పృహ కలిగిస్తోంది. అంచేత ఇవన్నీ ఆలోచించిన మీదట, మనం ఇక్కడ చెయ్యగలిగిందేమీలేదనే నిర్ణయానికొచ్చేను. ఆ నిర్ణయానికొచ్చాక ఇంకా ఈ పాఠాలు, నోట్సులు ఇవన్నీ ఎలాటి దండ గమారి పనులో మీకు తెలియందేముంది.

కొత్త విషయాలు ఏవీ సాధారణంగా జరగవనీ, మనం కొత్తగా నేర్చుకోవలసింది ఏదీలేదనీ మనకి తెలియక్కాదు- తెలుసు. బతుకు వూబిలో చిక్కుకుపోయిన తర్వాత, బయటపడ్డం అసాధ్యం అని తెలిసినా, ఏ దోరకంగా బయటికి రావడానికి ప్రయత్నాలు చెయ్యకుండా వుండలేంకదా! ఈ ప్రయత్నాల్నే భ్రమలందాం. ఎవరికీ ఇంతవరకు అర్థంకాని విషయాన్ని దేన్నైనా తెలుసుకోవడానికి అవకాశం వస్తుందేమోనన్న భ్రమలో ఈ స్కూల్లో చేరాను. అదికూడా వుత్త దింపుడు కళ్లం ఆశేనని తేలిపోయింది. ఎలాటి అసంతృప్తి, నిరాశలతో ఇక్కడికి వచ్చానో, తిరిగి అదే నిరాశా, అసంతృప్తులతో ఇక్కడ్నుంచి వెళ్ళిపోతున్నాను రేపటెల్లుండిలోగా"

"నిరాశ, అసంతృప్తి దేనికయ్యా- మేమంతా హాయిగా నవ్వుతూ, తుళ్లుతూ బతకడం లేదా?"

"మీ అందర్లాగా బ్రతకలేకపోవడమే నా ట్రాజెడీ!

ఏదీ జరగదనే అసంతృప్తి, ఏదీ చెయ్యలేం అనే నిరాశ, మనని ఏ క్షణంలోనైనా కబళించడానికి సిద్ధంగా మృత్యువు కాచుక్కూచుందనే నిస్పృహ- ఇవి చాలవు మేష్టారూ, మనని 'క్రియ' నుండి 'నిష్క్రియ' స్థితివైపు తీసుకుపోవడానికి!"

"నాయనా, నువ్వు త్వరగా ఇక్కడ్నుంచి వెళ్ళిపో. మనకేం తక్కువ, గొప్ప ప్రివిలైజ్డ్ కుటుంబాల్లో పుట్టేం, గొప్ప ఎయిలీట్ స్కూల్లో చదువుకుంటున్నాం, మనదీ అసలు సిసలైన సంపూర్ణ జీవనం అనే కాంప్లసెన్సులో బతుకుతున్నారు ఇక్కడి విద్యార్థులంతా. అది నిజమో, భ్రమో మాకక్కర్లేదు- కాని హాయిగా రోజులు గడిచిపోతున్నాయి- అది చాలు మా జీవితాలకి. నువ్వుగాని ఇంకా కొన్నాళ్లు ఇక్కడవుంటే, జీవితాన్ని నిరాశా నిస్పృహల దృష్టి కోణం నుండి చూడ్డం వీళ్లకి అలవాటయిపోయి, నీలాగే నైరాశ్యపు వూబిలో కూరుకుపోతారు. అంచేత వెంటనే ఇక్కడ్నుండి వెళ్లిపో"

"అలాగే వెళ్లిపోతాను మేష్టారు- కాని ఒక్క సంగతి గుర్తుంచుకోండి. చీకట్లో వుంటూ, అబ్బో ఎంతటి వెలుతురులో వున్నాం అని భ్రమపడే వాళ్లకు చివరికి భ్రమే మిగులుతుంది. మీ కోరిక మేరకి రేపే బయల్దేరి ఇక్కడ్నుండి వెళ్ళిపోతాను." ●

# ఊతకర్రకే చెదబడితే...

**ప్రకృతి - వికృతి**



నాగసూరి వేణుగోపాల్

బస్సు దిగి మావూరు వెళ్ళాలంటే - వేరుశనగ దుక్కిల్లోబడి మూడు కిలోమీటర్లు నడవాల్సి వుంటుంది. నున్నటి మట్టి, కొండలు, గుట్టలు తప్ప మరే పచ్చదనం అక్కడ కన్పించదు. చెరువులూ, కుంటలూ, బావులు నీరులేక ఎండిపోయి తుమ్మ పొదలతోనో, జాలి చెట్లతోనో, రేణి కంపలతోనో, మరే పిచ్చిమొక్కలతోనో నిండి వుంటాయి. అయితే మధ్యమధ్యన చింత, వేప, కానుగ, సుంకేసరి, చిగురు, జాలి, రావి చెట్లు దర్శనమిస్తూ వుంటాయి. చింత తోపులు మాత్రం అక్కడక్కడ కనబడతాయి. పొలాలంటూ ఏమీ వుండక అంతా బీడుగానే కనబడతాయి. గొర్రెలు, మేకలు, పశువులు గుంపులు గుంపులుగా అక్కడక్కడ దర్శనమిస్తాయి. వాటి తోపాటు వాటి కాపర్లు - మనకు కనబడే దృశ్యం. అంతకుమించి విభిన్న పరిస్థితి అక్కడ కనబడే అవకాశంలేదు.

పొలిమేరలు దాటి ఊరిలోకి అడుగు పెట్టగానే మనకు ఊరంతా ఆ రెండు చెట్ల క్రిందనే ప్రదర్శితమవుతుంది. పనీ, పాటాలేని ముసలీ ముతకా; పనిచేయని మధ్య వయస్కులు; గోళీకాయలు, చిల్లాకట్టె ఆడే పిల్లోళ్ళు; పశువుల మందలూ; గప్పాలు కొట్టుకొనే ఆడాళ్ళు; తాళ్ళు పేను కునే వాళ్ళు; ఎద్దులకు మేత పెట్టేవాళ్ళు... ఇలా అంతా ఆ రెండు చెట్లక్రిందనే సేదదీర్చుకుంటారు. విశాలమైన అరుగూ, అరుగు మధ్యలో సమదూరంలో రెండు చెట్లూ, ఆ రెండు చెట్ల మధ్య మూడు రాతి బొమ్మలు-నాగులు - ఉంటాయి. ఆ వూళ్లో పెళ్ళి జరిగితే వరుడు మొదట అక్కడే ఆగి, వధువు ఇంటికి వెడతాడు. తోలుబొమ్మల వాళ్ళు వస్తే ఆ అరుగుమూలన ఉన్న సత్రంలో మకాం వేసి, రాత్రిపూట అక్కడే ప్రదర్శన ఇస్తారు. అంతేకాదు పొట్లాటలు జరిగినా రంగస్థలం - ఆ అరుగే!

ఇటువంటి అరుగును - అశ్వత్థం కట్ట అంటారు. అక్కడవుండే రెండు చెట్లు రావి, వేప! ఈ రెండు చెట్లు మొదటపెట్టి, కాస్త పెరిగాక ఒకటి, ఒకటిన్నర మీటరు ఎత్తువుండే అరుగును - అశ్వత్థం కట్టను - కడతారు. ఆ రెండు చెట్లలో రావి చెట్టు ఎత్తుగా, మొదలు కాస్త లావుగా, గంభీరంగా ఉంటుంది. వేపచెట్టు కాస్త చిన్నగా ఉండి, పెరుగుదల తక్కువగా వుండటంతో అది రావిచెట్టు కింద ఒదిగిపోయినట్టు కనిపిస్తుంది. అందుకే ఈ రెండు చెట్లను భార్యాభర్తల అనుబంధానికి చిహ్నంగా పరిగణిస్తారు. అంతేకాక ఈ అనురాగ బంధానికి ప్రతీకలుగా ఆ రెండు చెట్ల మధ్య మూడు రాతి ఫలకాల మీద నాగుబాముల బొమ్మలు వుంటాయి. మధ్యనవుండే బొమ్మలో నాగబంధంగా రెండు పాములు పెన వేసుకుని వుంటాయి. అందుకే వధూవరుల బాసి కాలు ఆ చెట్లకు కడతారు. పిల్లలులేని స్త్రీలు ఆ అశ్వత్థం, నాగులు చుట్టూ తిరుగుతారు.

ఇది అనంతపురం జిల్లాతోపాటు రాయలసీమ ప్రాంతాలు, కర్నాటకలోని కొన్ని ప్రాంతాలలో కనబడే దృశ్యం. ఇటువంటివి డెల్టా ప్రాంతంలో కనబడవు. శైవం వెల్లివిరిసిన ప్రాంతాలు కూడా ఇవే కావడం విశేషం. అందుకే కర్నాటకలో విదురాశ్వత్థం క్షేత్రంలో ఇటువంటి దృశ్యం భారీ ఎత్తున కనబడుతుంది.

ఇంతా చెప్పడం ఎందుకంటే - ఈ రావి, వేపచెట్లు అక్కడ జనజీవితంలో ముఖ్యభాగమేకాదు, వారి సంస్కృతికి ఒక ప్రతీక. మతాచారాలు, నమ్మకాలు పక్కనవుంచినా మనకు ఎన్నో విషయాలు బోధపడతాయి. అశ్వత్థం కట్ట ఎదురుగానే మా ఇల్లు ఉండడంతో పదేళ్ళ వయసు దాకా అక్కడి వాతావరణం బాగా గమనించాను. ఆ వేపచెట్టు ఉగాది తర్వాత పండిన కాయను రాల్చితే అలా నోట్లో వేసుకొని, ఇలా ఉమ్మివేసే వేయగానే చేదు రుచి అనుభవించిన జ్ఞాపకం కూడా. వేపచెట్టు అయితే ఒక హిందూ మతపరంగానే కాదు, ముస్లిం సంప్రదాయపరంగా కూడా ఆ చెట్టుకు విశిష్టత వుంది. వారు సైతం అతి పవిత్రంగా చూస్తారు. అట్లాంటి అరుగులు కూడా మా వూళ్ళో ఉన్నాయి.

**వేపపుల్లను నోటి వుల్లగా; వేపపూతను ఉగాది పచ్చడిలోనూ; వేప ఆకును దోమలు తరమడానికీ; ఆకుల రసం చర్మరోగాలు నిర్మూలించడానికీ; వేపగింజలు మందుల తయారీకీ, ఎరువుగానూ, పశువులకు ఆహారంగానూ; వేప కలప ఇంటి నిర్మాణానికీ, కాగితం, ప్లాస్టిక్ పరిశ్రమలలోనూ వాడతారు.**

ఇక ఇతరత్రా ఆలోచనలరీత్యా వేప చెట్టుకు ఎంతో ప్రాధాన్యత ఉంది. ఆర్థిక లాభాలు, ఇతర విధాలా వేపను కొబ్బరి తర్వాత పేర్కొంటారు. వేపపుల్లను నోటి పుల్లగా; వేపపూతను ఉగాది పచ్చడిలోనూ; వేప ఆకును దోమలు తరమడానికీ; ఆకుల రసం చర్మరోగాలు నిర్మూలించడానికీ; వేపగింజలు మందుల తయారీకీ, ఎరువుగానూ, పశువులకు ఆహారంగానూ; వేప కలప ఇంటి నిర్మాణానికీ, కాగితం, ప్లాస్టిక్ పరిశ్రమలలోనూ వాడుతారు. వేప ఆధారంగా తయారయ్యే క్రిమినాశకాలు, క్రిమిసంహారుణులు చాలా శక్తివంతమైనవేకాదు, పర్యావరణానికి హాని కల్గించనివిగా పరిగణిస్తారు. అందుకే మనకు వేప ఆధారంగా తయారైన సోపులు, టూత్‌పేస్టులు విపరీత ప్రచారంలో వున్నాయి. వేపకున్న ప్రాధాన్యత మనం పూర్తిగా గుర్తించకపోయినా బహుళజాతి సంస్థలు ముందుగా గుర్తించి పేటెంటు వల విసిరి, ఉచ్చు బిగిస్తున్నాయి. ఇది బయటి నుంచి వచ్చిపడుతున్న ముప్పు అయితే లోపల మరో పెనుభూతం పొంచివున్నట్టు మైసూరు విశ్వవిద్యాలయం పరిశోధకులు అంటున్నారు.

సురక్షితమైన రసాయనాలకూ, మంచి క్రిమినాశకాలకూ, చౌకగా తయారయ్యే మందులకూ, అంతేకాక జనాభా నియంత్రణకూ, ఎడారీకరణ, వేడెక్కుతున్న వాతావరణానికి ఈ "అద్భుత వృక్షమే" పరిష్కారంకాగలదని శాస్త్రవేత్తలు పేర్కొంటారు. అంతెందుకు దయ్యం పట్టినప్పుడుకూడా వేపమండలే తగిన శాస్తి అని అందరి నమ్మకం. అటువంటి వేపకే నేడు కొత్త చీడ అంటుకొంటోంది. చెట్టుమీద పగుళ్ళుగా కనబడే "డై బ్యాక్" (die-back) అనే వ్యాధి కర్నాటకలోని బెంగుళూరు, చామరాజనగర్, చిక్‌మగళూరు, చిత్రదుర్గ, హసన్, మండ్యా, టుంకూర్ ప్రాంతాల్లో కనబడుతోంది. తత్ఫలితంగా పూత, కాతల్లో తేడా వస్తోంది. ఇటువంటిది 1986లో ఆఫ్రికాలో కనబడినా, యిక్కడ 1997లో వెలుగులోకి వచ్చింది. అంతేకాక 'మిస్‌లెటో' (mistletoe) అనబడే మరో పరాన్నజీవి వేపమీదబడుతోంది. వృక్షశాస్త్రరీత్యా "డెండ్రోప్తో ఫాల్కాట" (Dendrophthoe Falcata) అని పిలువబడే ఈ పారాసైట్ ఆక్టోపస్‌లా చెట్టుకు వ్యాపిస్తుంది. వేపచెట్టునుండే నీరు, పోషకపదార్థాలు గ్రహిస్తుంది. ఈ దొంగదెబ్బ కారణంగా వేపలో పెరుగుదల, పూత, కాత దెబ్బతినడమేకాక, ముందుగానే చెట్టు చనిపోతుంది. ఈ పరాన్నజీవి ఒక చెట్టునుండి మరో చెట్టుకు పళ్ళుతినే పక్షుల ద్వారా రవాణా అవుతుంది. ఒక్కసారి కొత్త వేపచెట్టు మీదికి పోగానే, ఈ పరాన్నజీవి పునాదులు వేసుకొని, దాని పతనానికి నడుంకడుతుంది. అంతేకాదు ఈపరాన్నజీవి పూసి, కాయలు కాచి బలపడుతుంది. దాంతో వేప ఆకులు, పూలు తేడాగా కనిపిస్తాయి. దీనికి పరిష్కారంగా చీడ అంటుకున్న కొమ్మలు కొట్టివేయడమో, లేదా రసాయనాలు వాడటమో జరగాలి. అయితే రసాయనాలు వాడకం మంచిదికాదు అంటున్నారు పర్యావరణ శాస్త్రవేత్తలు. అయితే వేప మీద పెరిగే పరాన్నజీవి మీద ఆధారపడే మరో పరాన్నజీవి వుంది. దీనిద్వారా మొదట పరాన్నజీవిని మట్టుబెట్టి వేపను రక్షించుకోవచ్చు. అయితే అంతకంటే ముందు కావల్సింది - వేపచెట్టుకు సంబంధించిన పరిపూర్ణ అవగాహన!